క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



ఆర్మూర్‌టౌన్‌: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం పరిశీలించారు. పట్టణంలోని ఆర్మూర్, పెర్కిట్, మామిడిపల్లిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులను పర్యవేక్షించారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ రఘు, సీనియర్ అసిస్టెంట్ సలీం తదితరులు ఉన్నారు.

పడాల రాములుకు ఘన నివాళి



బోధన్‌: పట్టణ కేంద్రంలోని పాన్‌గల్లీలో ఉన్న సీపీఐఎంఎల్ కార్యాలయంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు పడాల రాములు 22వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు, కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్, పడాల శంకర్, సీతారాం, పోశెట్టి, నాగయ్య, మల్లవ్వ, పార్వతి, గంగామణి, లక్ష్మి, సాయిలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్‌తో నీటి సరఫరా



నవీపేట: మండల కేంద్రంలోని తడగామ కాలనీలో 15 రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. 300 కుటుంబాలు నివసించే కాలనీలో యంచలోని మిషన్ భగీరథ మోటార్ మరమ్మతులకు గురవడంతో పాటు స్థానికంగా ఉన్న మూడు బోర్లు ఎత్తిపోయింది. దీంతో కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. ఈ విషయమై కాలనీవాసులు జీపీ సిబ్బందిని నిలదీయగా కాలం వెళ్లదీశారు. శనివారం కాలనీవాసులు ఆందోళనకు సిద్ధమవగా స్పందించిన సిబ్బంది వాటర్ ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేశారు. ఎత్తిపోయిన బోరుబావులకు మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కుల సంఘాలకు గాలం..



మోర్తాడ్‌: ఎన్నికల పోలింగ్‌కు గడువు సమీపించడంతో చివరి అస్త్రంగా కుల సంఘాల మద్దతు కూడగట్టేందుకు మూడు ప్రధాన పార్టీల నాయకులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. శనివారం సాయంత్రంతో ప్రచారానికి తెరపడటంతో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు తమ పార్టీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలిచేందుకు ఎవరికి వారు కుల సంఘాలతో రహస్య సమావేశాలు నిర్వహించి గంప గుత్తగా ఓట్లు పడేలా ప్రయత్నాలు చేస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే పెండింగ్ పనులు పూర్తి చేస్తామని, నిధులు కేటాయిస్తామని నాయకులు హామీలు ఇస్తున్నారు.

టోర్నమెంట్ విజేతగా రాకింగ్ స్టార్



డొంకేశ్వర్‌: మండల కేంద్రంలో బ్రదర్ యూత్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన బార్ల సాయికిరణ్ రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. రాకింగ్ స్టార్ జట్టు టోర్నమెంట్ విజేతగా నిలువగా, రన్నరప్‌గా ఎస్సెస్సీ బ్యాచ్‌మేట్స్ జట్టు నిలిచింది. జట్లకు ట్రోఫీతో పాటు నగదు బహుమతులు అందజేశారు. బార్ల చిన్నారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశరం భూమేశ్ రెడ్డి, చందు, శ్యామ్‌గౌడ్, నాగరాజు, వంశి తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలోగల శ్రీదేవీ శ్రీభూదేవీ సహిత వెంకటేశ్వర స్వామి ఆలయ ద్వాదశ వార్షికోత్సవాలు శనివారం రెండోరోజు వైభవంగా కొనసాగాయి. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వారు ఓటుకు దూరమే!

- వలస కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి

మోర్తాడ్(బాల్కొండ): వయోజనులు, వికలాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యామ్నయ చర్యలు తీసుకున్న ఎన్నికల కమిషన్ విదేశాలకు ఉపాధి కోసం వలస వెళ్లిన వారు ఓటు హక్కును వినియోగించుకునేలా ఎలాంటి ఏర్పాటు చేయలేదు. ఏళ్ల తరబడి కుటుంబాల కోసం విదేశాల్లో ఉంటున్న తాము పలు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోలేక పోయామని వలస కార్మికులు చెబుతున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా తదితర పాశ్చాత్య దేశాల్లో స్థిరపడిన భారతీయులు అక్కడ ఓటు హక్కును సంపాదించుకున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న వారికి మాత్రం ఎక్కడా తమ ఓటు హక్కు లేకుండా పోయింది. తెలంగాణలోని అనేక మంది గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో గల్ఫ్ ఓటర్లు సుమారు 1,48,136 మంది ఉన్నారు. వారు ఎన్నికల సమయంలో ఇంటికి వస్తే ఓటు వేసే వీలు ఉంది. తమ సమస్యలు పరిష్కారం కావాలన్నా, తమను రాజకీయ పార్టీలు గుర్తించాలంటే ఓటు వేసే అవకాశం కల్పిస్తే ప్రభుత్వాలు కదలి వచ్చేవని గల్ఫ్ వలస కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రాక్సీ ఓటింగ్ విధానం అంటే ఎక్కడ ఉన్నా తమ ఓటు హక్కును ఆన్‌లైన్‌లో లేదా మరో రకంగా వినియోగించుకునేలా చేస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీనిపై కసరత్తు చేసినా సాంకేతిక కారణాలతో ప్రతిపాదనలకే పరిమితమైంది. ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌లు ఉన్నట్లుగానే తమకు కూడా ఏదో రకమైన ఓటు హక్కు కల్పిస్తే బాగుండేదనే వాదనను గల్ఫ్ వలస కార్మికులు వెల్లడిస్తున్నారు.



వలస కార్మికులను గుర్తించడం లేదు



వలస కార్మికులను ఎన్నికల కమిషన్ గుర్తించడం లేదు. విదేశాల్లో ఉపాధి పొందుతున్న వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి. విదేశాల్లో ఆన్‌లైన్ ఓటింగ్ విధానం అమలులో ఉంది. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకుని సంస్కరణలు చేపట్టాలి.

– శివన్నోళ్ల రాజు, కువైట్ రిటర్నీ, ఏర్గట్ల

ఓటు హక్కును హరిస్తున్నారు



వలస కార్మికుల ఓటు హక్కును హరిస్తున్నారు. గల్ఫ్ కార్మికులు ఉపాధి కోసం ఏండ్ల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. వారు ఎక్కడ ఉన్నా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి. ఈ అంశంపై పోరాటం చేస్తాం.

– గుగ్గిల్ల రవిగౌడ్, గల్ఫ్ జేఏసీ చైర్మన్

దేశానికి మోదీ పాలన అవసరం



పెర్కిట్‌లో బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ఆంధ్రనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కోటపాటి

- ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి
- గ్రామాల్లో ప్రచారం, బైక్ ర్యాలీ

ఆర్మూర్/ పెర్కిట్/ నందిపేట్/ మోర్తాడ్: దేశానికి మోదీ పాలన అవసరమని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన శనివారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ నుంచి బైక్ ర్యాలీ ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ ప్రతి కార్యకర్త బీజేపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఆలూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి గ్రామస్తులతో చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని చేపట్టారు. నందిపేట మండలంలోని వన్నెల్(కె) గ్రామంలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీజేపీ చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు.

ఆంధ్రనగర్‌లో బీజేపీకి మద్దతుగా ఎస్‌ఆర్‌ఐలు ప్రచారం నిర్వహించారు. రైతు నాయకుడు కోటపాటి నరసింహనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఐలు నూకల వెంకట్‌రెడ్డి, నరేందర్ పన్నీర్ ప్రచారం చేశారు. దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించుకోవాలని కోరారు. ఏర్గట్లలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మాజీ సర్పంచ్ తోకల నర్సయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఓటేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏర్గట్లలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులకు ఆకర్షితులై చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్న ఉప్లూర్ ముదిరాజ్ సంఘం సభ్యులు



భీమ్‌గల్ మండల వాసులతో సునీల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి/ బాల్కొండ/ భీమ్‌గల్/ రెంజల్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, పలు గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సునీల్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు తిప్పిరెడ్డి శ్రీను, కొమ్ముల రవీందర్‌రెడ్డి, దేవేందర్, చింతకుంట శ్రీను, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ మండలం నాగంపేట్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి సునీల్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు సామ రాజేందర్, ముస్కు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ మండలంలోని పురాణిపేట్ గ్రామానికి చెందిన నూతన గౌడ సంఘం సభ్యులు, ఎంజీ తండా, బాబానగర్ కాలనీకి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, నాగేంద్ర, పల్లె శేఖర్ పాల్గొన్నారు.

రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి, వీరన్నగుట్ట, నీలా గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, మాజీ జెడ్పీటీసీ నాగభూషణంరెడ్డి, సాయారెడ్డి, చుంచుల రాములు, సాయారెడ్డి, గణేశ్‌నాయక్, మర్ల రమేశ్, సురేందర్‌గౌడ్, ధనుంజయ్, వినోద్, బస్సీనాయక్, దరంవీర్, చిలుక అశోక్, ఇందిరారెడ్డి, కవిత, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



సాలూరలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

బోధన్: ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఆఖరి రోజైన శనివారం సాలూర మండల కేంద్రంలో, కుమ్మన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో బాజిరెడ్డి గోవర్ధన్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, రాష్ట్ర నాయకురాలు నింబూరి సత్యవతి గౌతం ప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. సాలూరలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఎంపీ అర్వింద్ జిల్లా అభివృద్ధి చేసిందేమీ లేదని, కాంగ్రెస్ అభివృద్ధిని పట్టించుకోదని అన్నారు. ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును కారు గుర్తుకు ఓటేసి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు.

మైనార్టీలు కాంగ్రెస్‌ను నమ్మొద్దు

రెంజల్: కాంగ్రెస్‌ను నమ్మి మైనార్టీలు మోసపోవద్దని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు. మండలంలోని సాటాపూర్‌లో శనివారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ఎంపీ అర్వింద్ తండ్రి శ్రీనివాస్‌తో ఉన్న అనుబంధం వల్ల పార్టీలకు అతీతంగా అర్వింద్‌ను గెలిపించినట్లు కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వినిపించారు. సొంత పార్టీ అభ్యర్థి మధుయాష్కిగౌడ్‌ను ఓడించేందుకు జీవన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బీజేపీకి మద్దతు తెలిపారని గుర్తుచేశారు. ఎన్నికల్లో తన గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

అబద్ధపు హామీలతోనే కాంగ్రెస్ గెలుపు

వేల్పూర్/ నందిపేట్/ మాక్లూర్: అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో గెలిచిన కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్కోర, అమీనాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. నందిపేట మండలంలోని వెల్మల్, అయిలాపూర్, కౌల్పూర్, మాక్లూర్ మండలంలోని ముల్లంగి(బి), బొంకన్‌పల్లి గ్రామాల్లో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న మోసాలను వివరించారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్కోరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



వెల్మల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ముల్లంగి (బి)లో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి



ఎడపల్లిలో మాట్లాడుతున్న కెప్టెన్ కరుణాకర్ రెడ్డి

ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు

మాక్లూర్/ ఎడపల్లి/ బోధన్/ ఆర్మూర్‌టౌన్/ రుద్రూర్/ బోధన్‌టౌన్/ భీమ్‌గల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. మాక్లూర్ మండలంలోని ముల్లంగి(బి), గొట్టిముక్కల, బొంకన్‌పల్లి, ధర్మోరా, మాందాపూర్ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రజా సంక్షేమాన్ని మరిచి మతాల మధ్య చిచ్చు పెడుతోందని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సాలూర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గడప గడపకు వెళ్లి ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆర్మూర్ పట్టణంలోని రెండో వార్డులో స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేయాలని కోరారు. పోతంగల్ మండలం హెగ్డోలి, కొల్లూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ డల్లా సురేశ్ అన్నారు. బోధన్ పట్టణంలోని రైస్ మిల్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపునకు మాదిగలు, మాదిగ ఉపకులాలు కృషి చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని తట్టికోట్, శక్కర్‌నగర్, ఆచన్‌పల్లి, అంబేద్కర్ నగర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భీమ్‌గల్ మండలంలోని భీమ్‌గల్, రహత్‌నగర్, తాళ్లపల్లి, గంగరాయి, దేవక్కపేట్ గ్రామాల్లో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రభాకర్, మండల సభ్యులు ఉపాధి హామీ కూలీలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల్లో బీజేపీని ఓడించి, ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు.



సాలూరలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



ఆర్మూర్‌లో ఖాందేశ్ సంగీత

ముగిసిన యోగా శిక్షణ తరగతులు



శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులతో సభ్యులు

రుద్రూర్: మండల కేంద్రంలో పతంజలి యజ్ఞ సహిత యోగా కేంద్రం సభ్యులు విద్యార్థులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన యోగ, వ్యక్తిత్వ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణ తరగతులపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. క్షేత్ర పర్యటనలో భాగంగా శిక్షణార్థులను స్థానిక గోశాలకు తీసుకెళ్లారు. మానవ సేవతో పాటు మూగ జీవాల సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పతంజలి యోగా సమితి రాష్ట్ర సోషల్‌మీడియా కన్వీనర్ మహజన్ విశ్వనాథ్, కేవీ మోహన్, జి. శంకర్, పురుషోత్తం, మహజన్ నర్సింలు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ సభ్యులకు సన్మానం



బాల్కొండ: కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన గంగాధర్, పీడీ రాజుకుమార్‌ను ముప్కాల్‌లో స్థానిక నెహ్రూ యువజన కేంద్రం సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువజన కేంద్రం అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ.. కబడ్డీ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు వీరు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అసోసియేషన్‌లో చోటు దక్కడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గంగారాం, మోతె గంగారెడ్డి, గోపినాథ్, పుష్పనాథ్, శ్రావణ్, కనకయ్య పాల్గొన్నారు.

కవితల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



మహమ్మద్ రిమ్‌షా

మోర్తాడ్: వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కర్క ముత్తారెడ్డి స్మారక పాఠశాల విద్యార్థుల కవితల పోటీల్లో ఏర్గట్ల మండలం తడపాకల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని మహమ్మద్ రిమ్‌షాకు ప్రథమ బహుమతి లభించింది. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కవితల పోటీలను నిర్వహించగా ఐదు కవితలను ఎంపిక చేసిన నిర్వాహకులు బహుమతులను ప్రకటించారు. తడపాకల్ విద్యార్థిని రాసిన కవితకు ప్రథమ బహుమతి లభించగా త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థినికి నగదు బహుమతితో సత్కరించనున్నారని తెలుగు పండిత్ ప్రవీణ్ శర్మ వెల్లడించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్



ఆచన్‌పల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు



బాల్కొండలో..

బోధన్‌టౌన్: పట్టణంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో పోలీసులు, ప్రత్యేక బలగాలు శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని ఆచన్‌పల్లి, శక్కర్‌నగర్, రెంజల్ బేస్ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ సాగింది. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీపీ ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నేటి నుంచి 14వ తేదీ ఉదయం వరకు మద్యం దుకాణాలు బంద్ చేయాలని, మద్యం విక్రయించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామని, పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసులు, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

బాల్కొండలో..

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల్లో పోలీసులు శనివారం పోలీసులు కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు సహకరించాలన్నారు. కవాతులో ఎస్సైలు గోపి, భాస్కరాచారి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కమ్మర్‌పల్లి: మండలంలోని హాసకొత్తూర్‌లో 2007–08కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 01.20, ఆరంభం (తెలుగు) - 4.15, ప్రసన్న వదనం (తెలుగు) - 7.10, బ్రహ్మచారి (తెలుగు) 10.15
- స్క్రీన్-2 – కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ - 11.45, 2.55, 6.05, 9.15
- స్క్రీన్-3 – ప్రతినిధి-2 (తెలుగు) - 12.15, 6.20, 9.15, బాక్ (తెలుగు) - 3.10
- స్క్రీన్-4 – కృష్ణమ్మ (తెలుగు)- 12.45, 3.40, 6.35, 9.30

బీఆర్‌ఎస్‌లో యువకుల చేరిక



వేల్పూర్: ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్‌కు చెందిన యువకులు బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో శనివారం చేరారు. వేల్పూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటా ప్రచారం

బోధన్/ రెంజల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచార పక్రియ శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఆఖరి రోజు తమ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు జోరుగా ప్రచారం చేశారు. సాలూర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రెంజల్ మండలం నీలాలో బీజేపీ రాష్ట్ర నాయకుడు వడ్డి మోహన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమతమ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు.